# మరో గొంగళిపురుగు

**తం**డ్రిని చూసి ఇంట్లోకి పరుగెత్తుకెళ్ళి పుస్తకం చేతిలోకి తీసుకున్నాడు శ్రీనివాస్.

తనలో తాను నవ్వుకొంటూ ఇంట్లోకొచ్చి కొడుక్కెదురుగా పడక కుర్చీలో కూర్చున్నాడు రావు.

"ఆట...ఆట...ఆట...ఆట ధ్యాసే తప్ప చదువు ధ్యాసేమైనా వుందా నీకు...? అయినా గోలీలాటేంట్రా...?"

"అందరూ ఇదే ఆడుతున్నారు నాన్నా! మరి మిమ్మల్ని క్రికెట్ బాల్, బ్యాట్ కొనివ్వమంటే ఏమన్నారు...? రెండువందల రూపాయలవుతాయని వద్దన్లేదా...? "అన్నాడు శ్రీనివాస్.

"కొంచెం అవకాశమిస్తే చాలు, చదువాపి కబుర్లలోకి దిగుతాడు...చదువుకో..." కసిరినట్టన్నాడు రావు.

'ఈ రొటీన్ గాడింట్లో ఉన్నాడా...? ఉండక ఎక్కడికి చస్తాడులే...' తనలో తాననుకుంటూ పరమేశ్వరరావు ఇంటి గడపలో కదుగుపెట్టాడు రాఘవ.

రాఘవ చాలా చురుకైన వాడు. సమాజం గురించి కచ్చితమైన అభిప్రాయాలున్నవాడు. సాహిత్యావగాహన వుంది. రావు కెదురుగా కుర్చీలో కూర్చున్నాడు రాఘవ.

"మీ వాణ్ణి ఎదురుగా కూర్చోబెట్టుకొని మరీ చదివిస్తున్నట్టున్నారు. పిల్లల చదువు విషయంలో మరీ నిర్బంధం వద్దు. కొంచెమైనా ఫ్రీడమ్ ఇవ్వాలి..."అన్నాడు రాఘవ.

"ఇలాటి మాటలు చెప్పడానికి బాగానే ఉంటాయి. ఈకాలంలో ప్రతిదాంట్లో ఎంత కాంపిటేషనుందో నీకు తెలియంది కాదు. ఈ కాంపిటీషన్ యుగంలో నెగ్గుకు రావాలంటే ఎంత కష్టపడాలి? ఎంత చెప్పినా పిల్లలర్థం చేసుకోరు..."

అతని మాటలు ద్వారా పిల్లల భవిష్యత్తుపై భయాన్ని గమనించిన రాఘవకాతనిపై జాలేసింది.

"అయితే అందర్లాగే మీరూ మీ కొడుకును ఏ డాక్టరో, ఇంజనీరో చెయ్యాలనుకుంటున్నారు... అవునా...?"

"మనం చెయ్యాలనుకొంటే మాత్రం కావొద్దా...?" కొడుకును చూస్తూ అన్నాడు రావు... రాఘవతో మాట్లాడుతూనే శ్రీనివాస్‌ను గమనిస్తున్నాడు.

"అందరి టార్గెటూ అదే అయితే అయ్యేదెంతమంది? వాటి పేరు మీద

పిల్లలను పుస్తకాల పురుగులను చేసి వాళ్ళలోని సృజనాత్మకతను హత్య చేస్తున్నారు..." అన్నాడు రాఘవ.

"బియ్యేలు, ఎమ్మేలు చేస్తే దొరికేదేంటి...? అధవా దొరికినా నాలాంటి గుమాస్తా ఉద్యోగం. ఈ ఉద్యోగంతో బతుకు ఎక్కడేసిన గొంగళక్కడన్నట్టే వుంటుంది. సరే కాని, టీ తీసుకొండి" అన్నాడు రావు.

"అంకుల్...అంకుల్... నాకు హాఫియర్లీలో రాంకొచ్చింది" అన్నాడు శ్రీనివాస్.

"నైంత్ రాంకో రాంకా?" టీ తీసుకుంటూ అన్నాడు రావు.

"మొత్తంమీద ఫస్టురాంకొచ్చేవరకు మీ వాణ్ణి తోముతానంటారు!" టీ చప్పరిస్తూ అన్నాడు రాఘవ, అతని దృష్టి మరలించాలని–

"మీరు కట్టాలనుకున్న ఇల్లు సంగతేమైంది?" అన్నాడతను. ఆ మాటలు విని జెంటిల్మేన్‌లా నవ్వాడు రావు. ఆ నవ్వులో ఎన్నో భావాలను చూశాడు రాఘవ. గోడ నెక్కడానికి విఫల ప్రయత్నం చేస్తున్న గొంగళి పురుగును గమనించాడు.

"ఇల్లా? ఇల్లు కట్టడమంటే ఏమనుకుంటున్నారు మీరు?"

"ఏం? మీరు ఇల్లు కట్టలేరా?"

"అద్దె ఇంటి కష్టాలు భరించలేక నా భార్య పోరుతో కట్టాలనే అనుకున్నాను. ఏడెనిమిదేళ్ళు కష్టపడి నలభై వేలు కూడబెట్టాను. ఆ డబ్బుతో ప్లాటైనా రాదని తెలుసుకొని ఆశ్చర్యపోయాను. తర్వాత లోనైనా తీసుకొని కట్టుకోవాలనుకున్నాను. హెచ్.డి.ఎఫ్.సి.,ఎల్.ఐ.సి. వాళ్ళు తెమ్మన్న డాక్యుమెంట్లు తేలేక విరమించుకున్నాను. ఒకవేళ లోన్ దిరికినా నెలనెలా కటింగవుతుంటే మిగిలే జీతంతో నెల గడవడం కష్టమవుతుంది. ఓ దిక్కు పిల్ల లెదుగుతున్నారు. ఖర్చులు పెరుగుతున్నాయి. అందుకోసం అద్దె ఇంట్లోనే గడపక తప్పడంలేదు."

రావు మాటల్లో వైరాగ్యం, ముఖంలో నైరాశ్యం ఉండటం గమనించాడు రాఘవ. కొద్దిసేపు ఎవ్వరేం మాట్లాడలేదు.

"సరేకాని మీరెందుకు వచ్చారో చెప్పనే లేదు. ఊరకరారు మహాత్ములు" అన్నాడు రావు.

"మీరు హాస్యమాడుతారన్నమాట. ఫర్వాలేదు." అని హేండ్‌బ్యాగ్ లోంచి వెడ్డింగ్ కార్డు తీసి రావుకిచ్చాడు రాఘవ.

"మా అబ్బాయిది పెళ్ళి... లవ్ మ్యారేజ్... అంతేకాదు. కులాంతర, మతాంతర స్టేజి మారేజ్... కట్నాలు, కానుకలు, మంత్రాలు, తంత్రాలేవీ లేవు..."

రాఘవ మాటవిని ఆశ్చర్యంతో నోరెళ్ళ బెట్టాడు రావు. అతని ముఖంలో, భయాన్ని గమనించాడు రాఘవ.

"మొత్తం మీద అసాధ్యుడివే!" కొద్ది క్షణాలాగి అన్నాడు రావు.

"దీంట్లో అసాధ్యమైందేముంది?" అని కొద్ది క్షణాలాగి "మీకు ప్రమోషనొచ్చేదుంది కదా, వచ్చిందా...?" అన్నాడు రాఘవ.

"రాలేదు."

"క్వాలిఫికేషన్స్, సీనియారిటీ వున్నా ఎందుకు రాలేదు?"

"ప్రమోషన్ల సంగతి మీకు తెలియదా? పైకి పోవాలంటే పైవాళ్ళకు దగ్గరి వాడన్నా అయి వుండాలి. దాదాగిరి, చంచాగిరన్నా వుండాలి. రాజకీయుల సపోర్టయినా ఉండాలి. నాకివేవీ లేవు..." అన్నాడు రావు మామూలుగా.

"మీకున్న సిన్సియారిటీ, జెంటిల్మన్‌షిప్, గానుగెద్దులా పనిచేయడం సరిపోలేదన్న మాట..."

"అన్నట్టే కదా!"

"అయితే మీ ఆఫీసర్‌గాణ్ణి తన్నక పోయారా? లేదా ముప్పోతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించాల్సింది."

ఆ మాట తప్పయినట్టు ఇబ్బందిగా ముఖం పెట్టాడు రావు.

"సర్వీసన్న తర్వాత ఎన్నో జరుగుతాయి. తొందరపాటెందుకు?"

"అయినా మీరు మామూలుగా ఎలా పని చెయ్యగలుగుతున్నారు?"

"చెయ్యక చేసేదేముంది? తీసుకుంటున్న జీతానికి న్యాయం చేయాలి కదా?"

పాకీ పాకీ, ఇటూ అటూ చూసి గోడనానుకొని ఓ మూలకు ముత్తుగా పడుకున్న గొంగళి పురుగును, రావును మార్చి మార్చి చూశాడు రాఘవ.

కొద్ది క్షణాలాగి "వస్తాను" అని లేవబోయాడు.

"ఏం చేస్తారు వెళ్ళి - కూర్చోండి." రావనగానే కూర్చున్నాడు.

"మీరు శీనుకు చదువు చెప్పరా?"

"వాడు చదువుకుంటున్నాడు కదా! సరిపోతుంది."

వాళ్ళు మాట్లాడుకుంటూ ఉండగానే పరమేశ్వరరావు తమ్ముడు సోమేశ్వర రావొచ్చాడు.

బాత్‌రూంలో కెళ్ళి కాళ్ళు, చేతులు, ముఖం కడుక్కొని టవల్‌తో ముఖం తడుచుకుంటూ వచ్చి అన్న పక్కన కూర్చున్నాడు సోమేశ్వరరావు.

"అమ్మ ఆరోగ్యం బాగుందా?" తమ్ముణ్ణి అడిగాడు రావు.

"అంతంత మాత్రంగానే ఉంది. ఓల్డేజి కదా!"

"మీ అమ్మనొక్కదాన్నే ఊళ్ళో ఉంచడమెందుకు? మీతో ఉంచుకోరాదా?" అన్నాడు రాఘవ.

"మాతో రమ్మంటే రాదు. వచ్చినా ఒకటి రెండు రోజుల కంటే ఎక్కువుండదు. ఉన్న ఊరిపై మమకారం ఎక్కువ ఆమెకు" అన్నాడు రావు.

"ఆ తరం వాళ్ళకు పుట్టి పెరిగిన నేలంటే చాలా ప్రేమ. అయితే మనకున్నంత కూడా మన పిల్లలకుండదేమో?" అన్నాడు సోమేశ్వరరావు.

"ఆ మాట నిజమే" అని తలూపాడు రాఘవ.

"ఊళ్ళో అంతా బాగున్నారు కదా!" అన్నాడు రావు.

"బాగానే ఉన్నారు. అన్నయ్యా! వచ్చేనెల నాన్న సంవత్సరీకం కదా! బాగా చెయ్యాలంటున్నారంతా."

తమ్ముడి మాటలు విన్న రావు ముఖంలో ఆందోళనను గమనించాడు రాఘవ. తండ్రి చావుకైన ఖర్చులు అతనికింకా జ్ఞాపకమున్నాయి.

"దగ్గరి చుట్టాలను పిలుచుకొని సింపుల్‌గా చేస్తే సరిపోతుంది. అనవసరపు ఖర్చులెందుకు?"

"నాకూ అలాగే చెయ్యాలనుంది. కాని, అమ్మ, బంధువులు ఊరుకునేట్టు లేరు. ఈ విషయంలో మనం వెనుకాడితే, కన్న తండ్రి విషయంలో ఖర్చు పెట్టడానికి భయపడుతున్నారని మనల్ని ఆడిపోసుకుంటారు."

కాబోయే ఖర్చు, భయం పీడిస్తున్నా తమ్మునితో ఏమనలేకపోతున్నాడు రావు. అతడు చెప్పాలనుకున్న మాటలు నోట్లోనే ఉండిపోతున్నాయి.

"నిజమే! మీరిద్దరూ ఉద్యోగులే కదా! తండ్రి కర్మను ఘనాతిఘనంగా చెయ్యడానికెందుకు జంకుతున్నారు?" రావు నుడికించాలని అన్నాడు రాఘవ.

"తెలిసీ మీరిలా మాట్లాడుతున్నారు. ఉద్యోగమట ఉద్యోగం. పాతికేళ్ళుగా చేస్తున్నా ఒరగబెట్టిందేం లేదు. బతుకంతా గట్టుకు కట్టెలు మోసినట్టే అవుతుంది."

రావు మాటలు విని రాఘవ మరింత ఉడికించాలని "అయినా మీకీ సమాజంపై ఆగ్రహం కలుగదు" అన్నాడు.

అదేదో వినరాని విషయమైనట్టు ముఖం పెట్టి ముడుచుకుపోయాడు రావు. కొద్దిసేపాగి "అట్లా అని బజార్లోకొచ్చి ఆందోళన చెయ్యమంటారా?"

ఆందోళనలు తనలాంటి మర్యాదస్థులు, జెంటిల్మన్‌లు చేసేవి కాదన్నట్టుగా చెప్పిన రావు మాటలకు నవ్వొచ్చింది రాఘవకు.

"అక్కర్లేదు, మనలోకి మనం మరింత ముడుచుకుపోదాం" అన్నాడు.

"మీ లాంటివారు మిన్ను విరిగి మీద పడ్తున్నా దేన్నీ పట్టించుకోరు" అన్నాడు మళ్ళీ.

"అన్నిట్నీ పట్టించుకుంటూ మీరు మాత్రం ఏం ఊడబొడుస్తున్నారు?" కొంచెం కోపంగా అన్నాడు రావు.

రావు భార్య పిలువగానే సోమేశ్వరరావు, శ్రీనివాస్ లోపలి గదిలోకెళ్ళారు.

"పర్వాలేదు, మీకూ కోపమొస్తుందన్నమాట" అని నవ్వాడు రాఘవ. అతనితో శ్రుతి కలిపాడు రావు.

"నేను మీ ఒక్కరి గురించి చెప్పడం లేదు. మీలాంటి సగటు మనుషులు దేన్నీ పట్టించుకోకుండా ఇల్లు, పిల్లలు, భార్య, ఆఫీసు అని గిరిగీసుకొని బతుకుతున్నారు. థాంక్యూలతో, సెల్యూట్లతో సంతృప్తి పడుతున్నారు. అట్టడుగు జనంలోలా మీకు తెగింపు లేదు. ఉద్యమాల పట్ల ఆసక్తి లేదు" అన్నాడు రాఘవ.

"ఏంటీ రోజు పెద్దపెద్ద మాటలు చెబుతున్నారు. నాకివన్నీ తెలియవు. నేనితర్లకు నష్టం చేయకుండా బతుకుతాను. అన్నీ పట్టించుకోవడం నావల్ల కాదు" అన్నాడు రావు.

ఆ మాటలు విని నవ్వాడు రాఘవ. "వ్యక్తిగతంగా మంచిగా ఉండొద్దని

చెప్పడం లేదు నేను. కాని అది మాత్రమే సరిపోదు. సమాజంలో వుంటూ దాన్ని పట్టించుకోనంత మాత్రాన సమాజంలోని సంఘటనల ప్రభావం మనిషి పై పడకుండా ఉండదు. ధరలు పెరగడం, తీవ్రవాదం లాంటి సమస్యలు తమ ప్రభావాన్ని చూపకుండా వుంటాయా? మీకు దేనితోనూ సంబంధం లేకున్నా మీ కొడుకు గురించి చెప్పమని ఆ రోజు పోలీసులు మిమ్మల్ని వేధించలేదా? సమాజంలో భాగమైన మనిషి పై ఉద్యమాలు, ఆందోళనలు పరోక్షంగానైనా ప్రభావం చూపుతాయి. అయితే దురదృష్టవశాత్తు మనదేశంలోని మెజారిటీ మధ్యతరగతి జనాలు వేటినీ పట్టించుకోరు."

రాఘవ మాటలను శ్రద్ధగా వింటున్నాడు రావు. "ఇవన్నీ ఇప్పుడెందుకులే..." ముడుచుకుపోతూ అన్నాడు.

"చాలా సేపైంది నేను వచ్చి... ఏవేవో చాలా మాట్లాడుకున్నాం, వస్తా" అని లేచి నిల్చున్నాడు రాఘవ.

ఇంతలో పరమేశ్వరరావు పెద్దకొడుకు మిత్రుడు ప్రభాకర్ పరుగెత్తుకుంటూ వచ్చి రొప్పుతూ నిల్చున్నాడు. విషయం చెప్పడానికి జంకుతున్నాడు.

"ఏమైంది ప్రభాకర్ – మావాడేడి?" అడిగాడు రావు. రావు తమ్ముడు, భార్య, శ్రీనివాస్ బయటిగదిలోకొచ్చారు.

"సదరన్ స్ట్రీటులోంచి మేం నడిచిపోతున్నాం. ఎవరో వెనుకనుంచొచ్చి రమేష్‌ను కత్తితో పొడిచి పారిపోయారు. వెంటనే రమేష్‌ను హాస్పిటల్లో చేర్పించాం. మీరు రండి" అంటూ వచ్చినంత వేగంతో పరుగెత్తుకెళ్ళాడు ప్రభాకర్.

రావు భార్య, శ్రీనివాస్ గొల్లుమన్నారు. అన్నదమ్ముల కనుగుడ్ల నిండా నీళ్ళు, ముఖంలో ఆందోళన... ఆటోలో అందర్నీ కూర్చోబెట్టుకొని హాస్పిటల్‌కు తీసుకెళ్ళాడు రాఘవ. కత్తిపోట్లు బలంగానే తగిలినా రమేష్‌కు ప్రాణాపాయమేం లేదన్నారు డాక్టర్లు. ఆ మాటలు విన్న పరమేశ్వరరావు ముఖంలో ఆందోళన కొంత తగ్గింది.

తన కొడుకు కత్తిపోట్లకు గురి కావడానికి కారణం తనలాంటి వాళ్ళకే మాత్రం సంబంధంలేని మత సంఘటనని తెలుసుకొని ఆశ్చర్యపోయాడు రావు. కోపంతో అతని ముఖం ఎర్రబారింది. అంతా గమనిస్తూనే ఉన్నాడు రాఘవ.

"సమాజం గూర్చి పట్టించుకోనని మీరెంతగా ముడుచుకు పోయినా ఆ సమాజం మిమ్మల్ని వెంటాడుతూనే వుంటుంది" అన్నాడు రెండ్రోజుల తర్వాత రావుతో రాఘవ.

కొడుకు హాస్పిటల్లో ఉన్నప్పుడు మత కలహాల గూర్చి, సామాజిక రుగ్మతల గూర్చి, ఆర్థిక స్థితిగతుల గూర్చి, మరెన్నో విషయాల గూర్చి తీవ్రమైన పదజాలంతో విమర్శించాడు రావు. రాఘవ రోజూ రావును కలుస్తున్నాడు.

వారం రోజుల్లో రమేష్ కోలుకున్నాడు. ఇప్పుడు పరమేశ్వరరావు మునుపట్లాగే ఆఫీసుకి పోతున్నాడు...వస్తున్నాడు. ఇదివరకట్లాగే తన చుట్టూ గిరిగీసుకొని బతుకుతున్నాడు.

రావును చూస్తున్న రాఘవకు ఒళ్ళు విరుచుకుంటున్నట్టు కనిపించిన గొంగళి పురుగు మళ్ళీ ముడుచుకుంటున్నట్టనిపించింది.

తిలక్ కవిత 'గొంగళి పురుగు' జ్ఞాపకం వచ్చి నిట్టూర్చాడు రాఘవ. ఆ కవితలోని గొంగళి పురుగుకూ పరమేశ్వరరావుకూ ఏమాత్రం తేడా కనబడటంలేదు రాఘవకు.

పరమేశ్వర రావు లాంటి గొంగళి పురుగుల సంఖ్య ఈ దేశంలో గణనీయంగా వుంది. కానీ గొంగళి పురుగులింకా, ఇంకా ముడుచుకుపోతూనే వున్నాయి. వాటిలో ఆవేశం, ఆక్రోశం నిబిడీకృతమై వున్నా, కదలాల్సిన విషయాల్లోనూ స్పందన కనబడటం లేదు. ఆ గొంగళి పురుగులే కదిలితే...?

పరమేశ్వర రావు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా తనలో తాను గొణుక్కున్నట్టనుకుంటాడు రాఘవ.

● *'ఉదయం' ఆదివారం, 17-7-94* ●

★ ★ ★